బోధన.. వేదన



ప్రొద్దుటూరు మట్టిమసీదు ఉర్దూ ప్రాథమిక పాఠశాలలో ఒకే తరగతి గదిలో అన్ని తరగతుల విద్యార్థులకు బోధిస్తున్న ఉపాధ్యాయురాలు

ప్రొద్దుటూరు నియోజకవర్గంలో 14 పాఠశాలల్లో ఒకరే ఉపాధ్యాయులు ఉన్నారు. వీటిని ఏకోపాధ్యాయ పాఠశాలలు అంటారు. వీటిలో అన్ని తరగతుల విద్యార్థులను ఒకే చోట కూర్చోపెట్టి విద్యాబోధన చేస్తున్నారు. మండల విద్యాశాఖాధికారి వేరొక ఉపాధ్యాయులను కేటాయించినప్పుడు మాత్రమే.. సెలవుపై వెళ్లాల్సి వస్తోంది. ఒక వేళ కేటాయించకపోయినా.. అత్యవసర పనుల మీద ఉపాధ్యాయుడు సెలవులో వెళ్తే.. ఇక్కడ బోధనలు కుంటు పడినట్లే. బద్వేలు మండలంలో 28, ఖాజీపేట మండలంలో 30, మైదుకూరు మండలంలో 18, బి.కోడూరు మండలంలో 19, చాపాడు మండలంలో 21, బ్రహ్మంగారిమఠం మండలంలో 15 ఏకోపాధ్యాయ పాఠశాలలు ఉన్నాయి.

– ప్రొద్దుటూరు కల్చరల్

టీవీ చదువులే గతి



మండలంలోని గాదెగూడూరు జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయుల కొరత వెంటాడుతోంది. విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా ఉపాధ్యాయులు లేరు. బైలాజికల్ సైన్స్ సబ్జక్టుకు ఉపాధ్యాయుడు లేకపోవడంతో పదో తరగతి విద్యార్థులు టీవీ ద్వారా పాఠ్యాంశాలు వింటున్నారు.

– రాజుపాళెం

నేల బారు చదువులు

మండలంలోని పిడుగుపల్లె ప్రాథమిక పాఠశాలలో 23 మంది విద్యార్థులు ఉన్నారు. పాఠశాలలో విద్యార్థులు కూర్చునేందుకు బెంచీలు లేకపోవడంతో కింద కూర్చొని విద్యను అభ్యసించాల్సిన పరిస్థితి ఏర్పడింది. అలాగే వర్షం వస్తే 1, 2 తరగతుల గదులు ఉరుస్తున్నాయి.

–కలసపాడు



పిడుగుపల్లె దళితవాడలో బల్లలు లేకపోవడంతో కింద కూర్చొన్న దృశ్యం

పర్యవేక్షణ కొరవడి
గాడి తప్పుతున్న బడి

సర్కారు బడి మళ్లీ తడబడుతోంది.. గత ప్రభుత్వం సర్కారు బడులకు జీవం పోసింది. కార్పొరేట్ స్థాయి హంగులు తీసుకొచ్చింది. రంగులు అద్ది.. మెరుగులు దిద్దింది. ఐదేళ్లూ కొత్త ఒరవడితో చదువుల విప్లవం సాగింది. కొత్త ప్రభుత్వం ఏర్పడిన రెండు నెలల్లోపే చతికిలబడుతోంది. విద్యా వ్యవస్థపై సరిగా దృష్టి సారించకపోవడంతో.. ఉపాధ్యాయుల కొరత వేధిస్తోంది. అంతా సర్దుబాట్లతోనే నెట్టుకురావాల్సి వస్తోంది. పాఠశాలలు తెరిచి 50 రోజులు దాటినా.. విద్యార్థుల చేతికి ఇంకా కొన్ని పాఠ్యపుస్తకాలు అందలేదు. విద్యా కానుక కిట్ల పంపిణీ పూర్తి కాలేదు. మధ్యాహ్న భోజనం రుచి తగ్గుతూ వస్తోంది. అమ్మ ఒడి వంటి ప్రోత్సాహం ఇవ్వకపోవడంతో.. పేద విద్యార్థులు, వారి తల్లిదండ్రులు అవస్థలు పడుతున్నారు.



మైదుకూరులోని గడ్డమాలవాడలో మూడు తరగతుల విద్యార్థులకు బోధిస్తున్న ఉపాధ్యాయుడు

- సర్కారు బడుల్లో మళ్లీ సమస్యల పాఠాలు
- ఇంకా అందని కొన్ని పాఠ్యపుస్తకాలు
- పూర్తి కాని విద్యాకానుక పంపిణీ
- వేధిస్తున్న ఉపాధ్యాయుల కొరత
- పట్టించుకోని కూటమి ప్రభుత్వం
- అవస్థలు పడుతున్న విద్యార్థులు

ప్రొద్దుటూరు కల్చరల్/రాజుపాళెం/ఖాజీపేట/దువ్వూరు/బద్వేలు అర్బన్/అట్లూరు: ప్రొద్దుటూరు, మైదుకూరు, బద్వేలు నియోజకవర్గాల్లోని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్యకు సరిపడ ఉపాధ్యాయులు లేరు. కొన్ని మండలాల్లో ఒకరే ఉపాధ్యాయులు ఉన్నారు. అన్ని తరగతుల విద్యార్థులను ఒకే చోట కూర్చోపెట్టి విద్యాబోధన చేస్తున్నారు. రాజుపాళెం మండలంలోని పలు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో బైలాజికల్ సైన్స్ పోస్టులు, వెలవలి, తొండలదిన్నెలో హెచ్‌ఎం పోస్టులు, గాదెగూడూరు, పర్లపాడు గ్రామాల్లో వంద కంటే తక్కువగా విద్యార్థులు ఉండటంతో హెచ్ ఎంతో పాటు పీఈటీ పోస్టులు ఖాళీలు ఉన్నాయి. ఖాళీగా ఉన్న సబ్జెక్టును చెప్పేందుకు ఆదే పాఠశాలల్లోని కొంతమంది ఉపాధ్యాయులు బోధిస్తున్నారు. ఖాజీపేట మండలంలో పుల్లూరు కొట్టాలు, అప్పనపల్లె బీసీ కాలనీలో ఉపాధ్యాయులు లేక ఇన్‌చార్జులతో పాఠశాలు నడిపిస్తున్నారు.



ప్రభుత్వపాఠశాలలో విద్యార్థులకు పెడుతున్న మధ్యాహ్నం భోజనం అధ్వానంగా తయారైంది. ఉడికీ ఉడ కని అన్నం, నీళ్లచారుతోనే కడుపు నింపుకుంటున్నారు. కొందరు విద్యార్థులు ఇంటి నుంచే భోజనం తెచ్చుకొని తింటున్నారు. సోమవారం బద్వేలు పట్టణంలోని జెడ్పీ హైస్కూల్‌లో చాలామంది విద్యార్థులు ఇళ్ల వద్ద నుంచి బాక్సులు తెచ్చుకుంటున్నారు.

-బద్వేలు అర్బన్

ప్రొద్దుటూరు నియోజకవర్గం	
మండలాలు	2
ప్రభుత్వ పాఠశాలల సంఖ్య	148
ఉపాధ్యాయుల సంఖ్య	765
అవసరమైన టీచర్ల సంఖ్య	30
విద్యార్థుల సంఖ్య	16,585

మైదుకూరు నియోజకవర్గం	
మండలాలు	5
ప్రభుత్వ పాఠశాలల సంఖ్య	349
ఉపాధ్యాయుల సంఖ్య	1,230
అవసరమైన టీచర్ల సంఖ్య	334
విద్యార్థుల సంఖ్య	21,130

బద్వేలు నియోజకవర్గం	
మండలాలు	7
ప్రభుత్వ పాఠశాలల సంఖ్య	367
ఉపాధ్యాయుల సంఖ్య	845
ఏకోపాధ్యాయుల సంఖ్య	111
విద్యార్థుల సంఖ్య	36,478

• రాజకీయ కుంపటి

విధి నిర్వహణలకు తమకు ఇబ్బందులు ఏర్పడుతాయనే ఉద్దేశంతో విద్యాశాఖ అధికారులు.. అధికార పార్టీ నేతలు చెప్పిందే తడువుగా అమలు చేస్తున్నారు. నేతలు అలా చెబితే నిబంధనలకు విరుద్ధంగా ఇలా చేసి పెడుతున్నారు అధికారులు. ప్రొద్దుటూరు మున్సిపాలిటీ పరిధిలోని ఎద్దుల వెంకటసుబ్బమ్మ మున్సిపల్ బాలికల ఉన్నత పాఠశాలలో గతంలో సాకె జయలక్ష్మి వంట ఏజెన్సీ నిర్వహిస్తుండేది. భోజనం కూడా నాణ్యతగా ఉండేదని స్వయంగా గతంలో జిల్లా అధికారులే అభినందించారు. ఎన్డీఏ ప్రభుత్వం అధికారంలోకి రావడంతో అధికార పార్టీ నేతలకు ఈ ఏజెన్సీపై కన్ను పడింది. మీరు ఏమి చేసుకుంటారో మాకు సంబంధం లేదు ఆ ఏజెన్సీని మార్చాలని ఆదేశించడంతో విద్యాశాఖాధికారులు వెంటనే ఉన్న ఏజెన్సీని తొలగించి తమ వర్గీయులను నియమించారు. రామేశ్వరం మున్సిపల్ హైస్కూల్, ఖాదర్‌బాద్ జెడ్పీ హైస్కూల్‌తోపాటు దాదాపు పది పాఠశాలల్లో ఇప్పటి వరకు అధికారులు ఏజెన్సీలను మార్చారు. కల్లూరు గ్రామంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలతోపాటు మరో పాఠశాలలో ఇలాంటి పరిస్థితులు నెలకొన్నాయి. కొన్ని పాఠశాలల్లో నాసిరకంగా భోజనం పెడుతున్నా అధికార పార్టీ వారు కావడంతో అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్న విమర్శలు వినిపిస్తున్నాయి.

– ప్రొద్దుటూరు

పాఠశాలకు రక్షణ లేదు



పాఠశాలలో నైట్ వాచ్‌మెన్ లేకపోవడంతో ఇబ్బందులు పడాల్సి వస్తోంది. పాఠశాలను రూ.23 లక్షలతో అభివృద్ధి చేశారు. 255 మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. డిజిటల్ క్లాస్‌ల కోసం రూ.4లక్షల విలువ చేసే 6టీవీలు పాఠశాలలో ఉన్నాయి. నైట్ వాచ్ మెన్ లేక పోవడంతో దొంగలు పాఠశాలలోని విలువైన సామగ్రిని తీసుకెళ్తారని భయంగా ఉంది.

- రవీంద్రుడు, ప్రధానోపాధ్యాయుడు, హోమస్‌పేట ప్రాథమిక పాఠశాల

పాలకుల తీరు మారాలి



విద్యావ్యవస్థపై పాలకుల తీరు మారాలి. కూటమి ప్రభుత్వం ఇచ్చిన మాట మేరకు విద్యార్థుల తల్లికి వందనం అందించాలి. ఇంట్లో ఎంత మంది విద్యార్థులు ఉంటే అంత మందికి రూ.15 వేలు ఇస్తామనిచెప్పి అధికారంలోకి వచ్చిన తరువాత ఇప్పుడు మాట మార్చడం సరికాదు. విద్యావ్యవస్థను బలోపేతం చేసేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి. విద్యార్థులను ఇబ్బంది కలిగిస్తే ఉద్యమిస్తాం.

- నాగేంద్రబాబు, పీఆర్‌ఎస్‌వైఎఫ్ జిల్లా కన్వీనర్, ప్రొద్దుటూరు

ఖాళీల భర్తీకి చర్యలు



మండలంలోని పలు గ్రామాల్లోని పాఠశాలల్లో ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టులు భర్తీ చేసేందుకు చర్యలు తీసుకుంటాం. ఈ విషయాన్ని ఉన్నతాధికారులకు తెలియజేశాం. ప్రాథమిక పాఠశాలల్లో ఖాళీగా ఉన్న పోస్టులో మరొక ఉపాధ్యాయుడిని నియమిస్తున్నాం. హైస్కూల్ స్థాయి తమ పరిధిలో ఉండదని, ఆ వివరాలను ఉన్నతాధికారులకు తెలియజేసి చర్యలు తీసుకుంటాం.

- రామస్వామి రెడ్డి, ఎంఈఓ-2, రాజుపాళెం మండలం

ఉపాధ్యాయుల కొరత తీర్చాలి



ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా ఉపాధ్యాయులు లేకపోవడంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. మరికొన్ని చోట్ల ఏకోపాధ్యాయ పాఠశాలలు ఉన్నాయి. దీని వలన విద్యార్థులకు పూర్తిస్థాయిలో విద్య అందడం లేదు. పదవీ విరమణ పొందిన చోట ఏర్పడిన ఖాళీలను కూడా భర్తీ చేయడం లేదు. ప్రభుత్వం తక్షణమే స్పందించి ఉపాధ్యాయుల కొరత తీర్చాలి.

- ఎం.చిన్ని, డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు

మార్పులు అవసరం



విద్యార్థుల సంఖ్యతో సంబంధం లేకుండా ప్రతి పాఠశాలలో ఇద్దరు ఉపాధ్యాయులను నియమించాలి. ఓబీబీ ప్రమాణాల మేరకు అందులో ఒక ఉపాధ్యాయురాలు ఉండాలి. బోధన కుంటుపడకుండా ఉండాలంటే ఉపాధ్యాయులకు బోధనేతర పనులు తగ్గించాలి. నూతన విద్యావిధానంలో మార్పులు చేయాలి. విద్యాప్రమాణాలు తగ్గడం వలన తల్లిదండ్రులు ప్రైవేటు పాఠశాలల వైపు మొగ్గు చూపుతున్నారు.

- వై.అంగన్న, ఉపాధ్యాయుడు, మైదుకూరు

గదుల కొరత తీర్చాలి



జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా తరగతి గదులు లేకపోవడంతో ఆరుబయట చెట్ల కింద చదువుకోవాల్సి వస్తుంది. పాఠశాల ఆవరణలో అసంపూర్తిగా ఉన్న తరగతి గదులను త్వరితగతిన పూర్తి చేసి విద్యార్థులకు అందుబాటులోకి తేవాలి. మౌలిక వసతులు కల్పించాలి. ప్రభుత్వం విద్యాభివృద్ధికి కృషి చేయాలి

- ఇంతియాజ్, పదవ తరగతి, జెడ్పీ హైస్కూల్, బద్వేలు

పోరుమామిళ్ల యువకుడు హీరో కావడం గర్వకారణం

పోరుమామిళ్ల: పోరుమామిళ్లకు చెందిన కృష్ణవంశీ అనే యువకుడు సినిమాలో హీరోగా నటించడం మనకు గర్వకారణమని రాష్ట్ర ప్రభుత్వ మాజీ సలహాదారు నాగార్జునరెడ్డి పేర్కొన్నారు. సోమవారం ఆయన స్థానిక దేశాయ్ మహల్ థియేటర్‌లో కృష్ణవంశీ నటించిన అలనాటి రామచంద్రుడు సినిమాను పార్టీ నాయకులతో కలిసి వీక్షించారు. ఆయన మాట్లాడుతూ హీరో అద్భుతంగా నటించాడన్నారు.

సీజనల్ వ్యాధులతో జాగ్రత్త

చాపాడు: ప్రస్తుత వర్షా కాలంలో సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని నక్కలదిన్నె ప్రాథమిక కారోగ్య కేంద్ర వైద్యాధికారి డా.కావ్య మాధురి అన్నారు. మండలంలోని ఎస్.ఓబాయపల్లె గ్రామంలో సోమవారం వైద్య సిబ్బందితో కలసి వైద్యాధికారి పర్యటించారు. ఈ సందర్భంగా సీజనల్ వ్యాధుల వ్యాప్తి, వాటి నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఆమె మాట్లాడుతూ దోమ కాటు వలన మలేరియా, మెదడు వాపు వ్యాధి లాంటి జబ్బులు వస్తాయని తెలిపారు.

ఖాజీపేటలో విద్యుత్ అంతరాయం

ఖాజీపేట : ఖాజీపేట సబ్‌స్టేషన్‌లో 11 కేవీ వైర్ కట్ కావడంతో ఖాజీపేటలో విద్యుత్ లేక తీవ్ర అంతరాయం ఏర్పడింది. ఉదయం 6 గంటలకు విద్యుత్ సిబ్బంది దృష్టికి తెచ్చినా పట్టించుకోలేదు. ఉన్నతాధికారులకు ఫిర్యాదులు చేయడంతో మరమ్మతులు చేశారు. మధ్యాహ్నం ఒంటి గంటకు విద్యుత్‌ను పునరుద్ధరించారు. గంటల తరబడి విద్యుత్ సరఫరాలు అంతరాయం ఏర్పడడంతో స్థానికులు ఇబ్బంది పడ్డారు.

తైక్వాండోలో జాతీయ స్థాయికి ఎంపిక


పోరుమామిళ్ల: అనంతపురం జిల్లా తాడిపత్రిలో ఈనెల 2, 3, 4 తేదీల్లో జరిగిన రాష్ట్ర స్థాయి తైక్వాండో పోటీల్లో పోరుమామిళ్ల నుంచి 25 మంది విద్యార్థులు పాల్గొని 5 బంగారు, 6 కాంస్య పతకాలు సాధించినట్లు మాస్టర్ నాయబ్ రసూల్ తెలిపారు. బంగారు పతకాలు సాధించిన వారిలో నదీష్, వెంకట్ కల్యాణ్, అబ్దుల్‌అజీజ్, లోక్షిత, చరణ్ ఉన్నారు. కాంస్య పతకాలు సాధించిన వారిలో తస్విక, సుధీన్‌కృష్ణ, ఫయం బాషా, సాహిత్య, నందు, లక్కీ ఉన్నారు. కోచ్‌లుగా సుభాష్, ఉస్మాన్ వ్యవహరించినట్లు తెలిపారు.

రాజా ఫౌండేషన్‌ను కాపాడండి

ప్రొద్దుటూరు క్రైం : రాజా ఫౌండేషన్ సంస్థను కాపాడాలని ఆ సంస్థ మాజీ చైర్మన్ రాధా, నిరాశ్రయులైన మహిళలు ఎమ్మెల్యే వరదరాజులరెడ్డికి విన్నవించారు. ఈ మేరకు వారు సోమవారం ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేశారు. ప్రస్తుత ట్రస్టు సభ్యుల నుంచి తమకు ప్రాణహాని ఉందని అందులో పేర్కొన్నారు. వారు అనేక చిత్రహింసలకు గురి చేస్తున్న విషయాన్ని ఇప్పటికే జిల్లా కలెక్టర్, ఎస్పీ, జమ్మలమడుగు ఆర్డీఓలను స్వయంగా కలిసి చర్యలు తీసుకోవాలని కోరినట్లు తెలిపారు. డాడీహోం, పూజా స్కూల్, కిడ్స్ స్కూళ్లకు కనీసం నిర్వహణ, విద్యుత్తు బిల్లులు చెల్లించలేదని, వృద్ధులు, హెచ్‌ఐవీ బాధితులు, అనాథ పిల్లలకు తిండి ఖర్చులకు డబ్బు ఇవ్వకుండా అనేక ఇబ్బందులకు గురి చేస్తున్నారన్నారు. ఈ విషయమై ప్రశ్నించినందుకు తమపై తప్పుడు కేసులు పెట్టి జైలుకు పంపిస్తామని బెదిరిస్తున్నట్లు ఎమ్మెల్యేకు తెలిపారు. పరిశీలించి న్యాయం చేస్తామని వరదరాజులరెడ్డి తెలిపారు.

ఎస్‌ఎంసీ ఎన్నికలను సక్రమంగా నిర్వహించాలి

ప్రొద్దుటూరు కల్చరల్ : స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ ఎన్నికలను సక్రమంగా నిర్వహించాలని ఎస్‌ఎంసీ ప్రొద్దుటూరు డివిజన్ కోఆర్డినేటర్ దశరథరామిరెడ్డి పేర్కొన్నారు. స్థానిక అనిబిసెంట్ మున్సిపల్ హైస్కూల్‌లో సోమవారం ప్రొద్దుటూరు మండలంలోని ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు గురువారం జరుగనున్న ఎస్‌ఎంసీ ఎన్నికలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికలకు ప్రతి తరగతి నుంచి ముగ్గురు సభ్యులను తీసుకోవాలని, ఎస్సీ, ఎస్టీ నుంచి ఒకరు, బీసీల నుంచి ఒకరు, ఓసీల నుంచి ఒకరిని ఎన్నుకోవాలన్నారు. ఒకటి, రెండు తరగతులు ఉన్న పాఠశాలల్లో 6 మందిని, 1–5 తరగతులు ఉన్న పాఠశాలల్లో 15 మందిని, యూపీ పాఠశాలల్లో 21 మందిని, 1– 8 తరగతులు ఉన్న పాఠశాలల్లో 24 మందిని, హైస్కూల్‌లో 15 మందిని, 3–10 తరగతులు ఉన్న పాఠశాలల్లో 24 మందిసభ్యులను ఎన్నుకోవాలన్నారు. సభ్యులలో ఎక్కువ మంది మహిళలు ఎన్నికయ్యేలా చర్యలు తీసుకోవాలన్నారు. 50 శాతం కోరం ఉన్నప్పుడే ఎన్నికలు నిర్వహించాలని సూచించారు. ఏవైనా సమస్యలు ఉంటే పోలీసులకు ఫిర్యాదు చేయాలని తెలిపారు. ఎన్నికలను ప్రశాంతంగా నిర్వహించడానికి చర్యలు తీసుకోవాలన్నారు.



మాట్లాడుతున్న ఎస్‌ఎంసీ ప్రొద్దుటూరు డివిజన్ కోఆర్డినేటర్ దశరథరామిరెడ్డి

తల్లిపాలతోనే పిల్లలకు ఆరోగ్యం

ప్రొద్దుటూరు : తల్లిపాలతోనే పిల్లలకు ఆరోగ్యమని మున్సిపల్ కమిషనర్ జి.రఘునాథరెడ్డి తెలిపారు. ఐసీడీఎస్ అర్బన్ ప్రాజెక్టు ఆధ్వర్యంలో సోమవారం మహిళాశక్తి భవనంలో ప్రపంచ తల్లిపాల వారోత్సవాల సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో హెల్త్ ఎడ్యుకేటర్ వెంకటేశ్వర్లు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

ప్రొద్దుటూరు క్రైం : ముర్రుపాలు బిడ్డకు అమృతంతో సమానమని సీహెచ్‌ఓ కృష్ణమ్మ, హెల్త్ సూపర్‌వైజర్ బీపీ వరప్రసాద్‌లు తెలిపారు. కామనూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని సుబ్బారావు కొట్టాల, పెన్నానగర్, ఈశ్వరరెడ్డినగర్‌లలో సోమవారం తల్లిపాల వారోత్సవాల సందర్భంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. సీహెచ్‌ఓలు నరసింహ, శిరీషా, హెల్త్ అసిస్టెంట్‌లు సుబ్బయ్య, ఏఎన్‌ఎంలు దీప్తి, ఉమారాణి, అంగన్‌వాడి, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మున్సిపల్ కమిషనర్ రఘునాథరెడ్డి

చాపాడు: బిడ్డకు తల్లిపాలు అమృతంతో సమానమని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రాజ్యలక్ష్మి అన్నారు. తల్లి పాల వారోత్సవాలలో భాగంగా సోమవారం మండలంలోని లక్ష్మీపేట గ్రామంలోని అంగన్వాడీ కేంద్రంలో వర్కర్ భారతి ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఎంఎల్‌హెచ్‌పీ సుమలత, ఏఎన్‌ఎం కీర్తి, అంగన్‌వాడీ కార్యకర్తలు, హెల్పర్లు తదితరులు పాల్గొన్నారు.

బాధ్యతలు స్వీకరించిన తహసీల్దార్లు

రాజుపాళెం : అందరి సహకారంతో రెవెన్యూశాఖలో సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని తహసీల్దార్ జి.వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. రాజుపాళెం మండల తహసీల్దార్‌గా ఆయన సోమవారం బాధ్యతలు చేపట్టారు. వెంకటేశ్వర్లు కార్యాలయంలోకి రాగానే డిప్యూటీ తహసీల్దార్ మనోహర్ రెడ్డి, ఆర్‌ఐ అశోక్ ఘనంగా స్వాగతం పలికారు.

బ్రహ్మంగారిమఠం: నూతన తహసీల్దారుగా డి.దామోదర్ రెడ్డి సోమవారం బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా దామోదర్‌రెడ్డి మాట్లాడుతూ సమస్యలను పరిష్కరించేందుకు అందరి సహకారంతో కృషిచేస్తానని ప్రకటించారు.

చాపాడు: మండల తహసీల్దారుగా జి.రవీంద్రారెడ్డి సోమవారం స్థానిక మండల తహసీల్దారు కార్యాలయంలో బాధ్యతలు చేపట్టారు. బాధ్యతలు చేపట్టేందుకు వచ్చిన రవీంద్రారెడ్డికి రెవెన్యూ సిబ్బంది ఘన స్వాగతం పలికారు.



తహసీల్దార్ వెంకటేశ్వర్లుకు పుష్పగుచ్ఛం ఇచ్చి స్వాగతం పలుకుతున్న డీటీ మనోహర్ రెడ్డి

కాశినాయన :మండల తహసీల్దారుగా ఎం.బాలనరసింహులు సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తానన్నారు. రెవెన్యూ సిబ్బంది ఆయనను శాలువాతో సత్కరించారు.

పంట నమోదుతోనే ప్రయోజనం

ప్రొద్దుటూరు : ఖరీఫ్ సీజన్‌లో పంటలు సాగు చేసే ప్రతి రైతు వాటిని నమోదు చేసుకుంటేనే ప్రయోజనం చేకూరుతుందని వ్యవసాయశాఖ ఏడీఏ సురేష్ రెడ్డి పేర్కొన్నారు. సోమవారం ఉప్పరపల్లె గ్రామంలో పంట నమోదు ప్రక్రియను ఆయన పర్యవేక్షించారు. ఈ సందర్భంగా సురేష్ రెడ్డి మాట్లాడుతూ ప్రకృతి వైపరీత్యాల వల్ల పంటకు నష్టం వాటిల్లినప్పుడు రైతాంగాన్ని ఆదుకునేందుకు ప్రభుత్వం పలు విధాలుగా సాయం అందిస్తుందని తెలిపారు. ఏ ప్రయోజనాన్ని పొందాలన్నా రైతులు తాము సాగు చేసిన పంటలను నమోదు చేయించుకోవాల్సిన అవసరం ఉందని చెప్పారు. పంటలు పండినప్పుడు గిట్టుబాటు ధర కోసం ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తుందని పేర్కొన్నారు. పంట ఉత్పత్తులను అమ్ముకోవాలంటే ఇ–క్రాప్ బుకింగ్ అవసరమవుతుందని తెలిపారు. మండల వ్యవసాయాధికారి శివశంకర్‌రెడ్డి, వీఏఏ హరీంద్ర, వీఆర్‌ఓ జహరుద్దీన్ పాల్గొన్నారు.

విద్యుత్ ప్రమాదాలను నివారించండి

మైదుకూరు : మైదుకూరు డివిజన్‌లో విద్యుత్ ప్రమాదాలు జరగకుండా చూడాలని ఏపీఎస్‌పీడీసీఎల్ ఈఈ ఎన్.భరణి కృష్ణ అన్నారు. సోమవారం డివిజన్ కార్యాలయంలో డివిజన్‌లోని విద్యుత్ అధికారులతో ఆయన సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 33 కేవీ, 11 కేవీ సబ్‌స్టేషన్ల అంతరాయాలను వెంటనే సరిచేసి కరెంటు ఇచ్చేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. అధికారులందరూ అందుబాటులో ఉండాలన్నారు. వినియోగదారుల సమస్యలపై వెంటనే స్పందించి వాటిని పరిష్కరించే దిశగా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ట్రాన్స్‌ఫార్మర్లు కాలిపోకుండా ముందుగానే చర్యలు తీసుకోవాలని సూచించారు. వినియోగదారుల సమస్యలపై నిర్లక్ష్యం వహిస్తే క్రమశిక్షణ చర్యలు తప్పవని హెచ్చరించారు.